క్లుప్తంగా

జాతీయ రహదారి భూముల పరిశీలన


రహదారి ప్రాంతాల వివరాలపై చర్చిస్తున్న జేసీ

పామూరు: మండలంలో ప్రతిపాదిత 167బీ జాతీయ రహదారి భూములను జేసీ అభిషిక్త్ కిషోర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని దూబగుంట్ల వద్ద జాతీయ రహదారి వెళ్లే వాగు, బండిదారి, ఇతర భూములను ఆయన పరిశీలించారు. ఆర్డీఓ, తహసీల్దార్‌లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కనిగిరి ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్, తహసీల్దార్ బీఆర్ఎల్వీ ప్రసాద్, ఆర్ఐ నరగా ప్రవీణ్, వీఆర్ఓ శివప్రసాద్, షేక్.రఫి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్సవాలు

సింగరాయకొండ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక పాతసింగరాయకొండలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి.కృష్ణవేణి తెలిపారు. ఈ నెల 14వ తేదీ భోగి పండుగ రోజు సాయంత్రం గోదాదేవి కల్యాణం, 15వ తేదీ సంక్రాంతి పండుగ సందర్భంగా సాయంత్రం గ్రామోత్సవం, 16వ తేదీ కనుమ పండుగ సందర్భంగా సాయంత్రం తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

108 వాహనంలో ప్రసవం

పామూరు: మండలంలోని బుక్కాపురం ఎస్సీ కాలనీకి చెందిన కుమ్మరికుంట్ల ప్రేమకుమారికి బుధవారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. 108కు ఫోన్ చేయగా వెంటనే సిబ్బంది బుక్కాపురం చేరుకుని ప్రసవ నిమిత్తం ఆమెను పామూరు వైద్యశాలకు తరలిస్తున్నారు. మార్గమధ్యంలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ ఎం నారాయణ, పైలెట్ టీవీ నారాయణలు ప్రేమకుమారికి సుఖ ప్రసవం చేయగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

కొత్తూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కనిగిరి రూరల్: పట్టణంలోని 7వ వార్డు కొత్తూరులో అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 7వ వార్డులో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్లకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ నీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా మున్సిపల్ నిధుల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, స్థానిక కౌన్సిలర్, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు టి. సుజాత, వాసవీ సత్ర సముదాయ రాష్ట్ర అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు దేవరాజ్, వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖాజా, తిరుపతయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలి

- టీడీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్

పామూరు: ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్ సీపీని విజయపథంలో నడిపి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం గృహ సారథుల నియామకంపై పార్టీ నాయకులు, ఎంపీటీసీ, సర్పంచ్, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు అంకితభావంతో, ఉత్సాహంగా పనిచేసే వారిని గృహ సారథులను నియమించామన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వంపై టీడీపీ నాయకులు చేసే తప్పుడు ప్రచారం, ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీ, కులం, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. నాడు జన్మభూమి కమిటీల పేరుతో ప్రభుత్వ పథకాలును టీడీపీ నాయకులు, కార్యకర్తలే పొందావర్నారు. నీరు-చెట్టు పనులతో టీడీపీ నేతలు అక్రమంగా కోట్లు దోచుకున్నారని, దీనిపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రతి ఓటరును బూత్‌కు వచ్చేలా చూడాలన్నారు. గడిచిన మూడున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందజేసిన 28 సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీని దీవించేలా అందరూ ముందుకు సాగుదాం అని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి, వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం, కో ఆప్షన్ నాయబ్ రసూల్, యాదాల వెంకట సాయికిరణ్, డాక్టర్ కోట పాటి కార్తీక్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, యూత్ మండల అధ్యక్షుడు కందుల శ్రీను, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ అబ్దుల్, నాయబ్‌రసూల్, సచివాలయ మండల కన్వీనర్ షేక్.ఖాదర్‌బాషా, యాటా రాఘవేంద్ర, గోవిందయ్య, చల్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: రానున్న రోజుల్లో గృహ సారథులు, కన్వీనర్లే పార్టీకి కీలకమని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో వెలిగండ్ల మండల కన్వీనర్ల, నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ గృహ సారథులు ప్రభుత్వ పథకాలను ప్రజల దరి చేర్చడంలో వారధుల్లా పనిచేయాలన్నారు. కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ముగ్గురు త్రిమూర్తుల్లా పనిచేయాలన్నారు. రానున్న రోజుల్లో గృహ సారథులకు మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, పార్టీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, పొల్లా సుబ్రహ్మణ్యం, నాగూర్ యాదవ్, రాష్ట్ర డైరెక్టర్ పెన్నా వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, జార్జీ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ దేవా, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


కనిగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

జరుగుమల్లి (సింగరాయకొండ): ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఓట్ల కోసం కాదని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. జరుగుమల్లి మండలం తూమాడు గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం రాత్రి రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి అవినీతి రహితంగా, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పరిపాలనను మండల స్థాయి నుంచి గ్రామ స్థాయికి తీసుకొచ్చిన ఘనత జగన్‌దేనన్నారు. గతంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు పట్టణాలకు వెళ్లేవారని, ఇప్పుడు గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా అవి అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. దీని వలన రైతుకు ఖర్చు ఆదా అవడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతుందన్నారు. నాణ్యమైనవి లభించే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రతి గ్రామ వలంటీర్‌కు తోడుగా గ్రామ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు మరింత పారదర్శకంగా అందేలా ముఖ్యమంత్రి ప్రణాళికలు సిద్ధం చేశారని వివరించారు. ఇంత చేస్తుంటే ప్రతిపక్షాల వారు మాత్రం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతోందని, ఏదో జరిగిపోతోందని అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు తూమాటి శేషారెడ్డి, ఇంకొల్లు రవికుమార్, గడియం శ్రీను, గడియం కృష్ణ, కాటంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నల్లూరి సురేంద్ర పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న వరికూటి

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షునిగా వెంకటయ్య

సీఎస్‌పురం: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షునిగా ఏకునాంపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్యను నియమించారు. బుధవారం సీఎస్‌పురంలో జరిగిన వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ..మండల అధ్యక్షునిగా భువనగిరి వెంకటయ్య పేరును ప్రకటించారు. ప్రస్తుత మండల అధ్యక్షుడు కొర్రాజు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో పార్టీ పనుల్లో చురుకుగా పాల్గొనలేకపోతుండటంతో వెంకటయ్యను నియమించినట్లు తెలిపారు. అలాగే పార్టీ తరపున నియమించిన సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల పర్యవేక్షణకు మండల కన్వీనర్‌గా బోయమడుగుల ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి పేరును ఎమ్మెల్యే ప్రకటించారు. వీరిద్దరి నియామకంపై మండలంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం ప్రకటించారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో అధ్యక్షుడు పెరుగు సుబ్బరామయ్య, నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, యూత్ అధ్యక్షుడు ఎం అటేలయ్య, నాయకులు పాల్గొన్నారు.


వెంకటయ్య, తిరుపతిరెడ్డిలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

అసత్య ప్రచారాలు తిప్పికొట్టండి

సీఎస్‌పురం: ప్రభుత్వంపై టీడీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని, ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరించి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి నేటి వరకు ఒక్కో పంచాయతీలో అభివృద్ధి పనులకు రూ.8 నుంచి రూ.14 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణంలో భారీ అవినీతికి పాల్పడి ప్రభుత్వ నిధులను దోచేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాకే జమ చేస్తున్నారన్నారు. గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, పాలకేంద్రాలు, ఇతర భవన నిర్మాణాలు, పంట నష్టం జరిగిన వెంటనే పరిహారం చెల్లింపు, సంక్షేమ పథకాలు అమలులో నేరుగా లబ్ధిదారుల ఖాతాకే నగదు ఇవన్నీ అభివృద్ధి పనులు కావా, ఈ అభివృద్ధి టీడీపీ నేతలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయాల కన్వీనర్లను నియమించాలని, ఒక్కో వలంటీర్‌కు ఇద్దరు గృహ సారథులను సైతం నియమిస్తున్నామన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో కన్వీనర్‌గా బోయమడుగుల ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డిని నియమించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షుడు పెరుగు సుబ్బరామయ్య, నారాయణస్వామి, వీరభద్ర వీరాంజనేయ స్వామి ఆలయాల ట్రస్టుబోర్డు చైర్మన్లు దుగ్గిరెడ్డి జయరెడ్డి, మూరం మొరార్జి, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు ఎం అటేలయ్య, మండల మహిళా అధ్యక్షురాలు కుర్రా జయమ్మ, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల చిరంజీవి, నవోదయ హ్యూమన్‌రైట్ సొసైటీ అధ్యక్షుడు షేక్ గౌస్, ఎంపీటీసీలు, ఇతర నేతలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

నేడు జరుగుమల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండల కేంద్రంలో ఈ నెల 12వ తేదీ ఉదయం 7 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జరుగుమల్లి మండల కార్యాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అధికారులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జిల్లాస్థాయి షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

కనిగిరి రూరల్: జిల్లా స్థాయి మెగా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను బుధవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలను కనిగిరిలో నిర్వహించడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దేవకి రాజీవ్, క్లబ్ అసోసియేషన్ నాయకులు ఎస్‌వీ గోవర్దన్‌రెడ్డి, ముత్యాల శ్రీను, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘ అధ్యక్షునిగా సురేష్‌బాబు

వెలిగండ్ల: నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షునిగా వెలిగండ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబును ఎంపిక చేశారు. అలాగే వెలిగండ్ల మండల గ్రామ సచివాలయాల మండల కన్వీనర్‌గా పొల్లా సుబ్రహ్మణ్యంను నియమించారు. ఆ మేరకు బుధవారం కనిగిరి వైఎస్సార్ భవన్ లో జరిగిన వైఎస్సార్ సీపీ వెలిగండ్ల నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారిని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రకటించారు. కార్యక్రమంలో వెలిగండ్ల జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, నాయకులు పెరుగు మురళీకృష్ణ, వై నాగూర్ యాదవ్, టి.దేవసహాయం, సింగిల్‌విండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బుర్రాతో సుబ్రహ్మణ్యం, సురేష్‌బాబు

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

టంగుటూరు: రానున్న వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో జగనన్న కాలనీల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని, మండల మత్స్యశాఖ అధికారి రవి మత్స్యకారులకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అందుబాటులో ఉండాలని ఎంపీపీ కోరారు. పశుసంవర్థకశాఖ అధికారి మాట్లాడుతూ తెల్ల పశువులకు వచ్చే వ్యాధులకు వ్యాక్సిన్ అందిస్తున్నామని, ప్రాణాంతక వ్యాధులు ప్రస్తుతం లేవని అన్నారు. సబ్సిడీపై సమీకృత దాణా అందిస్తున్నామని, రైతులు ఉపయోగించుకోవాలని, జగనన్న పాల వెల్లువ పాల కేంద్రాల్లో పాలు పోసి రైతులు సరైన గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఎంపీడీవో అజిత, తహసీల్దార్ చిరంజీవి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడపాటి అరుణమ్మ, వైస్ ఎంపీపీలు రావెళ్ల ప్రదీప్, దగ్గుమాటి సుమన్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోటేశ్వరమ్మ

మారుకా మచ్చల పురుగును నివారించాలి

కొండపి: మండలంలో సాగుచేసిన కంది పంటకు మారుకా మచ్చల పురుగు ఆశించిందని, నివారణ చర్యలు చేపట్టాలని ఆత్మ పీడీ, జిల్లా వనరుల కేంద్రం కో ఆర్డినేటర్, మండల ప్రత్యేకాధికారి అన్నపూర్ణ రైతులకు సూచించారు. మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో కంది, శనగ పంటలను వ్యవసాయాధికారి పీ రాముతో బుధవారం పరిశీలించారు.

ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ చేయించుకోవాలి

పీసీపల్లి: ఈ క్రాప్ చేయించుకున్న ప్రతి ఒక్క రైతు ఈ కేవైసీ పూర్తి చేయాలని వ్యవసాయాధికారి జి.వెంకటస్వామి అన్నారు. మండల పరిధిలోని గుంటుపల్లి, చింతగుంపల్లి, పెదయిర్లపాడు రైతు భరోసా కేంద్రాల్లో జరుగుతున్న పీఎం కిసాన్ ఈకేవైసీ నమోదు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మండలం నుండి వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు వస్తారని ...వారి ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. మండలంలో 2151 మంది పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. రబీలో 8800 ఎకరాల్లో సాగు చేస్తే 5,600 ఎకరాల్లో మాత్రమే ఈ పంట నమోదు చేశారన్నారు.

రేషన్ పంపిణీ తనిఖీ

కనిగిరి రూరల్: ప్రతి కార్డుదారునికి తప్పనిసరిగా రేషన్ బియ్యం, సరుకులు అందచేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని మూడవ వార్డులో మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ నాణ్యమైన స్వర్ణ రకం బియ్యాన్ని కార్డు దారునికి ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కౌన్సిలర్ పెన్నా ఏడుకొండలు, శానటరీ సెక్రటరీ రమణారెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

14 మద్యం బాటిళ్లు, 2 బైక్‌లు సీజ్

పామూరు: పామూరులో అక్రమంగా ఇతర రాష్ట్రాల మద్యం కలిగి ఉన్న ఇద్దరిని బుధవారం అరెస్ట్ చేసినట్లు కనిగిరి సెబ్ సీఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. స్థానిక కందుకూరురోడ్డులోని పార్క్‌వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతూ బుల్లెట్ వాహనంపై మద్యం తరలిస్తున్న మానం కిషోర్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి పాండిచ్చేరికి చెందిన 14 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో భాగంగా పామూరులో మరోవ్యక్తి షేక్.అల్లాబక్షు వద్దనుండి గోవాకు చెందిన 2 లీటర్ల వంతున 3 మద్యం బాటిళ్లు, మోటార్‌బైక్ తోపాటు ఇరువురి సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

పొన్నలూరు: నేర నియంత్రణలో సీసీ కెమేరాలు కీలకమని ఎస్సై దాసరి రాజారావు అన్నారు. మండలంలోని ముండ్లమూరివారిపాలెం, వెంకుపాలెం గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల పనితీరును బుధవారం ఎస్సై పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేటి సమాజంలో నేర నియంత్రణకు సీసీ కెమేరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చన్నారు. గ్రామాల్లో సీసీ కెమేరాల ఏర్పాటుకు దాతలను చైతన్యం చేసిన మహిళా పోలీసు బి.శ్రీలక్ష్మి, దాతలు తానికొండ తిరుమలరావు, వినోద్, మహేంద్ర, బొప్పరాజు శ్రీలక్ష్మి, ముళ్లమూరి రేవతి, వెంకటేశ్వర్లు, యంప్రాల మాధవరావులను ఎస్సై అభినందించారు.

కోడి పందెం వేస్తున్న ఇద్దరు అరెస్టు

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని పొలాల్లో కోడి పందెం వేస్తున్న వారిపై సెబ్ పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సంఘటన బుధవారం జరిగింది. సెబ్ ఎస్సై దయాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో సోమరాజుపల్లి గ్రామానికి చెందిన నూకసాని శింగయ్య, పిగిలి సుబ్బారావును అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు వేల రూపాయల నగదు, ఒక కోడి, ఒక మోటారు సైకిల్, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సెబ్ ఎస్సై దయాకర్, స్థానిక ఎస్సై ఫిరోజ్ ఫాతిమా వివరించారు.


గోదాదేవికి ప్రత్యేక పూజలు


108 గంగాళాలతో గోదాదేవికి పాయసం నివేదిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: సంక్రాంతి వేడుకల్లో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానంలో బుధవారం గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 గంగాళాలలో పాయసాన్ని అమ్మవారికి నివేదించారు. అమ్మవారికి సారె ఇచ్చే కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

సీఎస్‌పురం: మండలంలోని కెవి నర్సయ్య నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓవరాల్ విభాగంలో నలుగురికి, మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థుల్లో ఇద్దరికి, 6,7,8 తరగతుల విభాగంలో ముగ్గురికి, 9 నుంచి ఇంటర్మీడియెట్ విభాగంలో ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఇరగని మాధవరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ముగ్గుల ను తిలకిస్తున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్

సీఎస్‌పురం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థునులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ కటకం సజనలు వేడుకల్లో పాల్గొని విద్యార్థినులను ప్రోత్సహించారు.

పామూరు: మండలంలోని మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో హెచ్‌యం దేవిరెడ్డి రామిరెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం వేడుకగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగిమంటలు వేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి సంబరాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వేసిన ముగ్గులు అలరించాయి.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, ATMAKUR
O.S. No. 31 / 2019

Devineni Dhanunjaya – Plaintiff
V/S
1. Akkili Narayanamma
5 others –Defendants

Notice

To, D5, Kamepalli Ramana Reddy S/o Venkateswarlu, D.No. 1-76, Pattouru, Thiragaladinne, Pamuru Mandal, Prakasham District.
D6, Kamepalli Venkata Reddy@Babu S/o Venkateswarlu, D.No. 1-76, Pattouru Thiragaladinne, Pamuru Mandal, Prakasham District.

పై నెంబరు కేసులో వాది మీమీద పైవారి కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తే 19-01-2023 దిన వాయిదా ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవలెనింది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

T. సురేష్, LLB
వాది తరపు న్యాయవాది, ఆత్మకూరు.

దేవదాయ ధర్మదాయ శాఖ : ఆంధ్రప్రదేశ్
శ్రీ భైరవేశ్వరస్వామి వారి దేవస్థానము
అంబవరం కొత్తపల్లి (గ్రా), సి.యస్.పురం (మం), ప్రకాశం జిల్లా.



సీల్డ్ టెండర్లు కొరకు ప్రకటన

టెండర్ నోటీసు నెం: 02/2022-23, తేది.07-01-2023

ప్రకాశం జిల్లా, సి.యస్.పురం మండలం, అంబవరం కొత్తపల్లి గ్రామము, భైరవకోనలో వేంచేసియున్న శ్రీ భైరవేశ్వరస్వామి వారి దేవస్థానములో తేది.18-02-2023 న జరుగు శ్రీ స్వామి వారి మహాశివరాత్రి మహోత్సవములకు ఈ క్రింద పేర్కొనబడిన ఐటములు సప్లై చేయుటకు సీల్డ్ టెండర్లు కోరడమైనది.
1. ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, మైకులు ఏర్పాటు చేయుటకు, 2. గుడ్డ పందిర్లు, షామియానాలు, హైరర్స్ సామానులు, స్టీలు జల్లలు, నీళ్ళ డ్రమ్ములు వగైరాలు సప్లై చేయుటకు, 3. బ్రహ్మోత్సవముల సందర్భముగా పుష్పములు సరఫరా, అలంకరణ. 4. సున్నపు పూతలు వేయుట (మెటీరియల్ - లేబర్ చార్జీలు), 5. భక్తుల సౌకర్యార్థం ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయుటకు, 6. పార్కింగ్ ప్లేస్ క్లియరెన్స్, జంగిల్ క్లియరెన్స్ మరియు వివిధ మరమ్మతుల నిమిత్తము (మైనర్ వర్క్స్) 7. ఎస్.యం.ఆర్ - సానిటేషన్ సిబ్బందిని సరఫరా చేయుట, సీల్డ్ టెండర్ ఫామ్స్ ను తేది.18.01.2023 న మధ్యాహ్నం 01.00 గంటల వరకు స్వీకరించి, అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో కార్యనిర్వాహణాధికారి వారిచే శ్రీ నారాయణస్వామి దేవస్థానం, మిట్టపాలెం వద్ద సీల్డ్ టెండర్లు తెరువబడును. దేవస్థానము కార్యాలయము పనిచేయు వేళలలో రూ.500/- చెల్లించి సీల్డ్ టెండర్ ఫామ్స్ ను పొందగలరు. పూర్తి చేసిన సీల్డ్ టెండర్ ఫామ్స్ ను తేది.18.01.2023 బుధవారం మధ్యాహ్నం 01.00 గంటల లోపల 1వ ఐటమ్ నుండి 3వ ఐటమ్ వరకు రూ.10,000/-, 4వ ఐటమ్ నుండి 7వ ఐటమ్ వరకు రూ.2,000/- చొప్పున నగదు లేదా దేవస్థానం పేరు మీద డి.డి తో జతపరచి దేవస్థానము కార్యాలయము నందు ఇవ్వవలెను. ఐటము నెం.1.2 లను కోట్ చేయువారు షాప్ పేరుతో ఎకౌంటు వుండి GST రిజిస్ట్రేషన్‌తో ఉండవలెను. మరిన్ని వివరములకు దేవస్థాన కార్యాలయములో సంప్రదించి తెలుసుకొనగలరు.

చైర్మన్ మరియు ధర్మకర్త మండలి	అంబవరం కొత్తపల్లి గ్రామము తేది: 07.01.2023	కార్యనిర్వాహణాధికారి సెల్: 9912500238

కెనరా బ్యాంక్ Canara Bank
కడప మెయిన్-II బ్రాంచ్ (13190)
7 రోడ్స్ జంక్షన్, కడప, వైయస్ఆర్ కడప జిల్లా-516001, ఆంధ్రప్రదేశ్.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
(1). M/s. పెన్నా పౌల్ట్రీ ఫామ్, 466/1, కొత్తపేట, పెండ్లిమర్రి మండలం, కడప-516216. (2). శ్రీ. పి. భాస్కర్ రెడ్డి, తండ్రి: శ్రీ. రామ చంద్రారెడ్డి, 39/654-1-1, పాత బైపాస్ రోడ్డు, రేణుక రెడ్డి స్కూల్ ప్రక్కన, చిన్నా చౌక్, కడప-516004, ఏ.పి. (3). శ్రీ ఎమ్. నరసింహారెడ్డి, తండ్రి: శ్రీ. స్వర్ణా రెడ్డి, మాచవరం, కలువకూరు మండలం, ప్రకాశం జిల్లా-523105. (4). శ్రీ ఎస్. చంద్రమోహన రెడ్డి, తండ్రి: లేటు శ్రీ. రామకృష్ణా రెడ్డి, హెచ్.నెం.: 1-440-13, మారుతీనగర్ కాలనీ, రాజీవ్ పార్కు దగ్గర, కడప (మండలం) (టౌన్), ఆంధ్రప్రదేశ్-516001. (5). శ్రీ కె.వి. చలమా రెడ్డి, తండ్రి: శ్రీ. గోవిందా రెడ్డి, హెచ్.నెం. 4 38, తిప్పిరెడ్డిపల్లె గ్రామం, ఆంధ్రప్రదేశ్-516216.
డియర్ సర్ / మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, కడప మెయిన్-II బ్రాంచ్ (13190) నుండి మెస్సర్స్ పెన్నా పౌల్ట్రీ ఫార్మ్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న 1. శ్రీ పి. భాస్కర్ రెడ్డి, తండ్రి: రామచంద్రారెడ్డి, 2. శ్రీ ఎమ్. నరసింహారెడ్డి, తండ్రి: స్వర్ణా రెడ్డి, 3. శ్రీ ఎస్. చంద్రమోహన రెడ్డి, తండ్రి: లేటు రామకృష్ణారెడ్డి గారు పొందిన లోన్స్ / ఋణ సౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేదీ నాటికి వడ్డీతో కలుపుకొని మొత్తం బకాయి	వడ్డీ రేటు
ఓవర్ డ్రాఫ్ట్ అకౌంట్ నెం. 31901250000979	రూ.70,00,000/- తేది:07.03.2014	రూ.76,47,325.12/- తేది: 06.01.2023 నాటికి	10.05%
టర్మ్ లోన్ అకౌంట్ నెం. 31908240000043	రూ.1,60,00,000/- తేది:07.03.2014	రూ.18,27,990.64/- తేది: 05.01.2023 నాటికి	11.40%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 13.08.2021 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.94,75,316/- (అక్షరాల తొంభై నాలుగు లక్షల డెబ్బై ఐదు వేల మూడు వందల పదహారు రూపాయలు) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఐదుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏదేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంకే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏదేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం సంబంధి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

చరాస్తుల వివరములు:
1. హైపోథికేషన్ ఆఫ్ స్టాక్ ఆఫ్ బర్డ్స్, ఫీడ్, బుక్ డెట్స్ వగైరా (ABS 2019 ప్రకారం).
2. తిప్పిరెడ్డి గ్రామ పొలం, ఖాజీపల్లి గ్రామ పంచాయితీ, ఎస్.నెం. 466/2, 466/3, 466/1, 467/1 తనఖాపెట్టిన పౌల్ట్రీ లేయర్ ఎక్విప్‌మెంట్స్/కేజెస్ మరియు షెడ్. టైటిల్ హోల్డర్: మెస్సర్స్ పెన్నా పౌల్ట్రీ ఫార్మ్స్.

స్థిరాస్తుల వివరములు:
ఆస్తి నెం-1: తిప్పిరెడ్డి గ్రామ పొలం, ఖాజీపల్లి గ్రామ పంచాయితీ, ఎస్.నెం. 466/2 నందు ఎ. 1.17 సెంట్లు, ఎస్.నెం. 466/3 నందు ఎ. 1.35 సెంట్లు, ఎస్.నెం. 466/1 నందు ఎ. 1.51 సెంట్లు, ఎస్.నెం. 467/4 నందు ఎ. 1.50 సెంట్లు, ఎస్.నెం. 467/1 నందు ఎ. 1.68 సెంట్లు కలిపి మొత్తం ఎ. 7.21 సెంట్లు లేదా 2.920 హెక్టార్ల భూమి మరియు అందులోని బిల్డింగ్ డాక్యుమెంట్ నెం. 3618/2011 ప్రకారం ఎమ్. నరసింహా రెడ్డి పేరున గలదు. హద్దులు: తూర్పు: ఆంధ్రప్రదేశ్ పల్లా రెడ్డి యొక్క భూమి, పడమర: రోడ్డు, ఉత్తరం: పెద్ద అస్సాన్ మరియు వెంకట్ భూమి, దక్షిణం: బండి రాస్తా. టైటిల్ హోల్డర్ పేరు: శ్రీ ఎమ్. నరసింహా రెడ్డి.
ఆస్తి నెం-2: కడప జిల్లా, పెండ్లిమర్రి మండలం, శంకరాపురం గ్రామం, అప్పారెడ్డిపల్లి మజరా, ఎస్.నెం.633/1 నందు ఎ.1.32 సెంట్లు మరియు సర్వే నెం.633/2 నందు ఎ.0.53 సెంట్లు కలిపి మొత్తం విస్తీర్ణం ఎ. 1.85 సెంట్ల వ్యవసాయ భూమి శ్రీ కొత్తపల్లి కాటంరెడ్డిగారి వెంకట చలమా రెడ్డి పేరునగలదు. హద్దులు: తూర్పు: అల్లూరి భూమి, పడమర: రోడ్డు, ఉత్తరం: డి. శివనారాయణ రెడ్డి భూమి, దక్షిణం: కె.కె.వి. మోహన్ రెడ్డి యొక్క భూమి. టైటిల్ హోల్డర్ పేరు: శ్రీ కొత్తపల్లి కాటంరెడ్డిగారి వెంకట చలమా రెడ్డి.
ఆస్తి నెం-3: కడప ఎన్‌జీఓస్, చిన్నా చౌక్ రీజియన్, ప్రకాష్ నగర్, వార్డు నెం. 8, ప్లాట్ నెం. 276, ఎస్.నెం. 909/2, డాక్యుమెంట్ నెం. 2324/2010, ప్రకారం శ్రీ పి. రెడ్డి భాస్కర్, తండ్రి శ్రీ పి. రామచంద్ర రెడ్డి పేరున గల: 5 సెంట్లు లేదా 0.020 హెక్టార్లు ఖాళీ భూమి. హద్దులు: తూర్పు : ప్లాట్ నెం. 277 స్థలం, పడమర: ప్లాట్ నెం. 275 స్థలం, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ఎస్.నెం. 910 భూమి. టైటిల్ హోల్డర్ పేరు: శ్రీ పి. రెడ్డి భాస్కర్.

తేది: 05.01.2023, ప్రదేశం: కడప
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్